# బాలమిత్ర

జూలై - 1998



జి. రామలక్ష్మి, హైదరాబాదు

## మోసాల్లో రకాలు, హెచ్చరికలు:

ఆడవాళ్ళు ప్రతి విషయంలోనూ ఉత్సాహం, తొందరపాటుతనం చూపిస్తుంటారే కానీ ఆలోచనకి అవకాశమివ్వరు. ఎవరికివారు తామే తెలివైన వారమనుకుంటూనే ఎవరి సలహో తీసుకోవడానికి యిష్టపడక మోసపోతుంటారు. ఎన్నో రకాలుగా వారు మోసాలలో ఇరుక్కుంటారు.

ఎలాగంటే, బట్టలు కొనేప్పుడు వీధుల్లో ఫుట్‌పాత్‌ల మీద, దుకాణాల్లో, మూటలవాళ్ళ దగ్గరా, యిలా అన్నిచోట్లా కూడా ఒకే డిజైన్ కల చీరలు చూస్తారు. అయితే దుకాణాల్లోకన్నా ఫుట్‌పాత్‌ల మీద అదే రకం చీర సగం ధరకే వస్తుందికదా ఇక షాపులో ఎందుకు కొనడం అనుకుంటారు. ఇక్కడ సగం ధరకే వస్తోంది అనుకుంటారు కానీ, క్వాలిటీ, పొడవు, వెడల్పు వగైరాల గురించి ఆలోచించరు. అలా ఆలోచించగలిగితే అంత చవుకగా ఎందుకిస్తున్నారన్నది తెలుసుకోగలుగుతారు.

అమ్మకందారులు చేసే మోసాలను దుకాణంలో అయితే రసీదు, అడగడానికి అడ్రసు వుంటుంది కాబట్టి పర్వాలేదు. అదే ఫుట్‌పాత్ మీద ఏదైనా కొనేప్పుడు దానికి రసీదు వుండదు. మోసపోతే మర్నాడు అడుగుదామన్నా వాళ్ళక్కడ వుండరు. అందుకని చవకబేరం అంటేనే సరుకులో ఏదో లోపం వుంటుందని గ్రహించాలి. ఒకటికి నాలుగుసార్లు బాగా పరీక్షించి చూడాలి. చవక రకంవి నాలుగు కొనేబదులు రెండే కొని మంచి నాణ్యత చూసుకోవాలి. అందుకనే దుకాణాల్లో సరుకు రసీదు పుచ్చుకుని మరీ కొనాలి.

అంతేకాకుండా కూరలు కొనేటప్పుడు, సరుకులు కొనేప్పుడు ఆ అమ్మకందారులు ముందు మిమ్మల్ని కబుర్లలో, పొగడ్తలతో ముంచేసి 'మీ చేతి బోణీ బేరం మంచిది' అంటూ ఉబ్బేస్తూ తూకం వంక మన దృష్టి పడకుండా హడావుడిచేస్తూ మనకి పుచ్చులు చచ్చులు అంటకట్టేస్తారు. ఇలా ఎంతోమంది



స్త్రీలు మోసపోతూవుంటారు.

అదే విధంగా పూలు కొనేటప్పుడు మనల్ని కబుర్లలో పెట్టి తక్కువ తక్కువ మూరలుగా కొలిచి అమ్మేస్తుంటారు. ఇలాంటి సందర్భాల్లో మాత్రం స్త్రీలు, వారి మాటల మాయాజాలంలో చిక్కుకోకుండా జాగర్తపడాలి.

అందుకని సాధ్యమైనంతవరకూ ధర కొంచెం ఎక్కువైనా నాణ్యతగల సరుకునే కొనడం మంచిది. మిగతా వస్తువుల కొనుగోలులో కబుర్లు చెప్పకుండా తూకాలనే గమనించండి. తక్కెడ వెనుక చింతపండు వుంటుంది గమనించండి. తూకం సమయంలో ఐ.ఎస్.ఐ ముద్రలకే ప్రాధాన్యత ఇవ్వండి. మోసంపాలు గాకుండా జాగ్రత్తపడండి. అమ్మే అమ్మకందారులు చేసే మోసాలను ఎదుర్కోవాలంటే, కొనేవారు అతి తెలివి ఉపయోగించాలి మరి.

**కేశాలంకరణ:**

ఆడవాళ్ళకు అందాన్నిచ్చేది కేశాలే. అవి ఎంత ఒత్తుగా, దట్టంగా, నల్లగా నిగనిగలాడుతూ పొడవుగా కనిపిస్తే అంత అందంగానూ వుంటారు. అందుకే అంటారు ''జుట్టున్నమ్మ ఎన్ని రకాల కొప్పులైనా చుట్టుతుంది'' అని. అది వాస్తవమేకదా.

అయితే అందరికీ జుట్టు పొడవుగా, ఒత్తుగా వుండదు. ఎందుకంటే ఈ జుత్తు పెరుగుదల వారసత్వాన్ని బట్టి, వారి వారి శరీరతత్వాన్ని బట్టే వుంటుంది. ఉన్నదాంతోనే లేని అందం కొనితెచ్చుకోవచ్చు! ఎలా? వయసునుబట్టి, జుట్టునిబట్టి, సమయానుకూలాన్నిబట్టి 'కేశాలంకరణ' విషయంలో జాగ్రత్తపడుతూ లేని అందం, హుందాతనం తెచ్చుకోవచ్చు.

ఈ రోజుల్లో ఎక్కడపడితే అక్కడ బ్యూటీ పార్లర్లు, ఆకర్షణలు మోజులు ఉండటం వలన జుట్టు కత్తిరించుకోవటం ఫ్యాషను అయిపోయింది. అది అలంకరణ, అంద' మాత్రమే కాదు. అనాకారితనం, పిచ్చితనం.

అందువలన ఫ్రాకులు వేసుకునే వయసులో రెండు జడలు పైకి కట్టుకుని రిబ్బను పెట్టుకుంటేనే కుచ్చులా అందంగా వుంటుంది. ఆ వయసులో అదీ ముచ్చట.

అదే విధంగా లంగా, ఓణీలు లేదా మోడరన్ డ్రస్సులు ధరించే వయసు టీనేజ్ అంటారు. అప్పుడు వాలుజడ అందంగా అనిపించవచ్చు. పొట్టిగావున్నా, పొడుగ్గా వున్నా, సన్నగా వున్నా లావుగా వున్నా ఒక్క జడే అందంగా వుంటుంది. వాలుజడ, మల్లెపూలు టీనేజర్స్ అందం మరింత పెంచుతాయి.

ఇకపోతే పెళ్ళయిన స్త్రీలకు వదులుగా జడ అల్లుకుంటే ఆకర్షణీయంగా వుంటుంది.

అదే విధంగా నడివయసు వచ్చాక సిగలు రకరకాల ముడులు, కొప్పులు అందంగా ముడుచుకుని కొప్పు చుట్టూ పూలదండ అమర్చుకుంటే అందంగా వుంటుంది. లేదా ఒక గులాబీ సైడ్‌కి పెట్టుకున్నా బావుంటుంది.

అంతేకాక వయసు పైబడ్డాక వాలుజడలు, యూ కటింగ్స్ ఇవి అందాన్ని ఇవ్వవు సరికదా ఎబ్బెట్టుగా ఉంటుంది చూసేవారికి. చక్కటి కేశాలంకరణలు వయసునిబట్టి చేసుకోవటంలో పైన చెప్పిన విధంగా పాటిస్తే మరింత అందాన్ని తెచ్చుకోవచ్చు.